క్లుప్తంగా

సామూహిక హనుమత్ వ్రతాలు



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి ఆలయ దత్తత దేవస్థానం రెడ్డిపాలెం శ్రీ అభయాంజనేయ స్వామివారి ఆలయంతో పాటు గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యదేవుని ఆలయంలో శుక్రవారం సామూహిక హనుమత్ వ్రతాలను నిర్వహించారు. స్వామివార్లకు తొలుత విశేషాభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలను వేద పండితులు రొంపిచర్ల శ్రీనివాసాచార్యులు, శరత్ చంద్ర చేపట్టారు. ఆలయ ఈఓ ఆకుల కొండలరావు ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

గుడ్లవల్లేరు రెవెన్యూ సదస్సులో అర్జీల స్వీకరణ

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు రెవెన్యూ సదస్సులో అర్జీలను తహసీల్దార్ బి.లోకరాజు స్వీకరించారు. గుడ్లవల్లేరు గ్రామ పంచాయతీ ఆవరణలో శుక్రవారం రెవిన్యూ సదస్సు నిర్వహించారు. భూ విస్తీర్ణం తగ్గిందన్న అర్జీలతో పాటు రైల్వే లైనుకు తన స్థలానికి సేకరించాక మిగిలిన పొలం రిజిస్ట్రేషన్ కావటం లేదని ఓ రైతు అర్జీ సమర్పించారు. ఈ అర్జీలను పరిశీలించి, సమస్య పరిష్కారం చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా సర్వేయర్ ఎం.జోషిలా, డీటీ సీహెచ్ జోగిబాబు, మండల సర్వేయరు పర్వీన్ సుల్తానా, గ్రామ మాజీ సర్పంచి చాపరాల బాలాజీ, వీఆర్వో శాయన ప్రకాష్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.3.82 లక్షలు

గుడివాడటౌన్: స్థానిక గౌరీశంకరపురంలో ఉన్న శ్రీ గౌరీశంకర స్వామి వారి దేవస్థానం, వాటి ఉప ఆలయాల హుండీ కానుకల లెక్కింపు శుక్రవారం జరిగింది. ఆలయ తనిఖీ అధికారి వి.సుధాకర్ సమక్షంలో లెక్కించిన స్వామి వారి కానుకలు రూ.3 లక్షల 82 వేల 163 వచ్చినట్లు ఆలయ ఈఓ వేణుగోపాలరావు తెలిపారు. ఇవి మూడు నెలల 20 రోజులు భక్తులు సమర్పించిన కానుకలని తెలిపారు.

స్టేట్ బ్యాంకులో ప్రారంభమైన ఏడీడబ్ల్యూఎం సేవలు



కూచిపూడి(మొవ్వ): కూచిపూడిలోని భారతీయ స్టేట్ బ్యాంక్ శాఖ కార్యాలయంలో ఎనీ టైం డిపాజిట్, విత్ డ్రాయల్ మిషన్ సేవలను శుక్రవారం రీజనల్ మేనేజర్ ఎస్.సుబ్రహ్మణ్యం (మచిలీపట్నం) ప్రారంభించారు. బ్యాంకు పని చేయని సమయంలో, సెలవుల్లో విత్‌డ్రా, డిపాజిట్, నగదు లావాదేవీలు నిర్వహించుకునే అవకాశం ఈ మిషన్ ద్వారా ఖాతాదారులకు కల్పించినట్లు ఆర్ఎం తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ డీహెచ్ వీవీఎస్ఎస్ఎస్ నాగ కుమార్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కూచిపూడిలో నాట్య స్తూపం ప్రతిష్ట

కూచిపూడి(మొవ్వ): ప్రపంచ ప్రసిద్ధి గాంచిన నాట్యక్షేత్రం కూచిపూడిలో శనివారం 50 అడుగుల ఏకశిల నాట్య స్తూపాన్ని ప్రతిష్ఠించనున్నట్లు కూచిపూడి వారసత్వ(హెరిటేజ్) సంస్థ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 27వ తేదీ నుంచి మూడు రోజులపాటు నిర్వహించే కూచిపూడి పతాక స్వర్ణోత్సవాలలో భాగంగా దీనిని ఆవిష్కరించనున్నట్లు ఫెస్టివల్ కమిటీ కన్వీనర్ డాక్టర్ వేదాంతం వెంకట నాగ చలపతిరావు తెలిపారు. ఇదే సమయంలో అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలోని భారత దౌత్య కార్యాలయంలో కూచిపూడి హెరిటేజ్ ఆర్ట్స్ సొసైటీ, భారతీయ దౌత్య కార్యాలయంలో కూచిపూడి కళానిలయం సంయుక్త ఆధ్వర్యంలో భారతదేశపు మువ్వన్నెల జెండా, అమెరికా జాతీయ పతాకాలతో పాటు, కూచిపూడి పతాకాన్ని ఏర్పాటు చేసి కూచిపూడి పతాక స్వర్ణోత్సవాలను నిర్వహించనున్నట్లు వెంకట నాగ చలపతిరావు వెల్లడించారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

మండవల్లి: భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులని ఇన్‌చార్జి తహసీల్దార్ కె.గోపాల్ అన్నారు. మండలంలోని ఇంగిలిపాకలంకలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ముంగర విజయనిర్మల, సర్పంచ్ ఘంటసాల రత్నకుమారి, వీఆర్వో వీర్రాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా దంత వైద్యం

గుడివాడటౌన్: రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ సేవా కార్యక్రమాల్లో భాగంగా 11 మంది విద్యార్థులకు రూ.30 వేల విలువగల దంత వైద్య సేవలు ఉచితంగా నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షుడు టీఎస్ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం స్థానిక గుడివాడ డెంటల్ హాస్పిటల్‌లో డాక్టర్ మలిరెడ్డి రవిరెడ్డి, డాక్టర్ ఎం.అనుదీప్ ఆధ్వర్యంలో ఈ వైద్యసేవలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి జి.కిరణ్‌బాబు, కోశాధికారి ఎన్.ప్రసాద్, పూర్వ అధ్యక్షుడు పి.రామకృష్ణ, ఎం.రమణమూర్తి, సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలపై సర్కారు అలక్ష్యం

- కనీసం మెడికల్ కిట్లు కూడా సరఫరా కాని వైనం
- చిన్నారులకు అందని సేవలు
- ఇప్పటివరకు చేరని పుస్తకాలు
- కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం

కూటమి ప్రభుత్వం రైతులు, మహిళలు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు తుంగలో తొక్కి వారిని నట్టేట ముంచింది. చివరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులపై కూడా చిన్న చూపు చూస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయాల్సిన మెడికల్ కిట్లు, ఆట వస్తువులను సరఫరా చేయడం లేదు. దీంతో కూటమి పాలనలో అంగన్‌వాడీ కేంద్రాలు కూడా నిర్వీర్యమవుతున్నాయి.



అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులు(ఫైల్)

పామర్రు: అంగన్‌వాడీ కేంద్రాలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తుందనే విమర్శలు వస్తున్నాయి. పట్టణ, గ్రామ స్థాయిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మెడికల్ కిట్లు, ఆట వస్తువులు లేకపోవడంతో ఆయా కేంద్రాలకు వచ్చే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఇప్పటివరకు పుస్తకాల సరఫరా చేయలేదు. ఇప్పుడు అంగన్వాడీ కేంద్రాల్లో అత్యవసరమైన మెడికల్ కిట్లు లేకపోవడంతో చిన్నారులకు ప్రథమ చికిత్స విషయంలో జాప్యం చోటు చేసుకుంటోంది. ఏదైనా మందులు అవసరమైతే ఆరోగ్య కార్యకర్తలపై ఆధార పడాల్సి వస్తోంది. మరో వైపు చిన్నారులకు మానసికంగా ఎదుగుదలకు అవసరమైన సుమారు 25 రకాల ఆట వస్తువులు కూడా అందుబాటులో లేవు. ప్రభుత్వం వెంటనే స్పందించి మెడికల్ కిట్లు, ఆట వస్తువులు సరఫరా చేయాలని అంగన్‌వాడీలు కోరుతున్నారు.

చిన్నారులపైనా నిర్లక్ష్యం

పామర్రు నియోజకవర్గంలోని పామర్రు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పామర్రు, పమిడిముక్కల, తోట్లవల్లూరు, పెదపారుపూడి మండలాలు ఉన్నాయి. పామర్రు మండలంలో 55, పెదపారుపూడి మండలంలో 39, పమిడిముక్కల మండలంలో 64, తోట్లవల్లూరులో 38 కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఆరు నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలు 1,654 మంది, మూడు నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు 1,276 మంది అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తుంటారు. వీరందరికీ ప్రభుత్వం ఆట వస్తువులు సరఫరా చేయాల్సి ఉంది. ఆయా కేంద్రాలకు నేటికీ మెడికల్ కిట్లు, ఆట వస్తువులు సరఫరా కాలేదు. వీరిలో ఆరునెలల నుంచి మూడు సంవత్సరాల లోపు చిన్నారులకు ఇంటికే పౌష్టికాహారం అందజేస్తారు. మిగిలిన మూడు సంవత్సరాలు దాటిన వారు కేంద్రాల్లో ఆట పాటలతో విద్య నభ్యసిస్తారు.

సౌకర్యాల కల్పనకు చర్యలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని రకాల సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం పుస్తకాలు సరఫరా జరిగాయి. మెడికల్ కిట్లు లేని చోట ఆరోగ్య సిబ్బంది నుంచి మందులు అందుతున్నాయి. మరి కొద్ది రోజుల్లో ఆట వస్తువులు అందుతాయి.

–వి.భానుశ్రీ, సీడీపీవో, పామర్రు ఐసీడీఎస్ ప్రాజెక్టు

ధర్నాకు తరలివెళ్లిన వైఎస్సార్ సీపీ నాయకులు



పామర్రు నుంచి ధర్నాకు తరలి వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు

పామర్రు: అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మచిలీపట్నంలో శుక్రవారం నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యాలయం నుంచి తరలి వెళ్లారు. తొలుత పార్టీ సీనియర్ నేత ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం ప్రజలను, రైతులను దగా చేసిందని, వైఎస్సార్ సీపీ వారికి అండగా ఉంటుందని అన్నారు. కూటమి ప్రభుత్వం చేతగానితనంతో మద్దతు ధర అందక అల్లాడుతున్న అన్నదాతకు అండగా నిలిచేందుకు తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధర్నాకు పిలుపునిచ్చారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, కాకర్ల వెంకటేశ్వరరావు,పెయ్యలరాజు, నత్తా రవి పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

కైకలూరు: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని కైకలూరు టౌన్ ఎస్ఐ డి.వెంకట్‌కుమార్ చెప్పారు. స్థానిక వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొల్లి వరప్రసాద్ ఆధ్వర్యంలో కామినేని సిరీస్ పేరుతో నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి 19 వరకు పోటీలు నిర్వహిస్తాయన్నారు. నియోజకవర్గం నుంచి మొత్తం 45 జట్లు పాల్గొంటున్నాయన్నారు. మొదటి బహుమతి రూ.25,000, రెండో బహుమతి రూ.15,000, మూడో బహుమతి రూ.10,000, నాల్గో బహుమతి రూ.8,000తో పాటు ఆటలో ప్రతిభ కనబర్చిన వారికి ప్రత్యేక బహుమతులు అందిస్తామన్నారు.

ఉత్సాహంగా పోటీలు

క్రికెట్ పోటీల్లో మొదటి రోజు ఐదు జట్ల మధ్య పోటీలు హోరాహోరీగా జరిగాయి. కైకలూరు బాలాజీ టీం, మండవల్లి గేమ్ చేంజర్స్ మధ్య పోటీలో బాలాజీ టీం, కైకలూరు విద్యాంజలీ వారియర్స్, కైకలూరు ఓజీ హంటర్స్ మధ్య పోటీలో విద్యాంజలి జట్టు, కైకలూరు హిమాలయ హిట్టర్స్, పల్లెవాడ వంశీ జట్ల మధ్య పోటీలో హిమాలయ జట్టు, కైకలూరు ఆక్వా టీం, ప్రత్తిపాడు జట్టు మధ్య పోటీలో ఆక్వా టీం, కైకలూరు చిన్నచెరువు గట్టు సీ టీం, ముదినేపల్లి మండలం గురజ జట్ల మధ్య పోటీలో గురజ జట్టు విజయం సాధించాయి. న్యాయ నిర్ణేతలుగా ప్రసాద్, జయప్రకాష్(జేపీ) వ్యవహరించారు.

జగనన్న, చంద్రన్న కాలనీలకు రహదారి నిర్మిస్తాం

ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడ్లవల్లేరు: జగనన్న కాలనీ, చంద్రన్న కాలనీ వాసుల కల అయిన ప్రధాన రహదారి నిర్మాణం చేస్తానని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హామీ ఇచ్చారు. ఆయన శుక్రవారం ఆ రెండు కాలనీల ప్రధాన రహదారిని పరిశీలించారు. ఈ కాలనీల్లో దాదాపు 1500 కుటుంబాలు నివసిస్తున్నాయని స్థానికులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ కాలనీలకు అంబేడ్కర్ నగర్ మీదుగా చుట్టూ తిరిగి వచ్చే సీసీ రోడ్డు తప్ప అధికారకంగా ఏ రహదారి లేకుండా పోయిందన్నారు. తమ ఇళ్లను నిర్మించుకోవాలన్నా మెటీరియల్‌కు దారి లేక నిర్మాణం కంటే రవాణాకు అధిక ఖర్చు అవుతోందని వాపోయారు. అంబేడ్కర్ నగర్ మీదుగా టిప్పర్ల ద్వారా ఇసుక, సిమెంట్, కంకర, స్టీల్ వంటి మెటీరియల్ రావాలంటే సీసీ రోడ్డు కావటంతో అక్కడి స్థానికులు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి కోసం రైల్వేస్టేషన్‌ను ఆనుకుని నివాసాల మీదుగా 30 అడుగుల వెడల్పుతో రోడ్డును నిర్మించేందుకు ఎమ్మెల్యే రాము తహసీల్దార్ బి.లోకరాజు, సిబ్బందితో కలిసి కొలతలు వేయించారు. ఇరు కాలనీలకు ఈ రహదారిని నిర్మించేందుకు చుట్టుపక్కలున్న నివాసుల నుంచి ఈ రోడ్డుకు స్థలాన్ని సేకరించవలసి ఉందని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కొసరాజు బాపయ్య చౌదరి తెలిపారు. రైల్వే శాఖ నుంచి కూడా అనుమతి తీసుకుని రోడ్డును నిర్మించి ఇరు కాలనీల వాసుల కలను నెరవేర్చాలని కోరారు. పర్యటనలో కూటమి నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, వల్లభనేని వెంకట్రావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పొట్లూరి రవి, లయన్స్ మాజీ చైర్మన్ పోలవరపు వెంకట్రావు, టీడీపీ నాయకులు మురాల నరేష్, నాగూర్, పంచాయతీరాజ్ ఏఈ నాగేశ్వరరావు, ఆర్ఐ పి.శివకుమార్, మండల సర్వేయరు పర్వీన్ సుల్తానా, వీఆర్వో శాయన ప్రకాష్ ఉన్నారు.



మ్యాప్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

విద్యార్థి దశలో సమయపాలన అవసరం

గుడివాడటౌన్: విద్యార్థి దశలో అందుబాటులో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం అలవర్చుకోవాలని ఆస్ట్రేలియా సాఫ్ట్‌వేర్ కంపెనీ టెక్ లీడ్ జి. శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక ఏఎన్నార్ కళాశాలలో నూతన సాంకేతిక పరిజ్ఞానం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు, డేటాసైన్స్, డేటా అనలటిక్స్, బ్లాక్ చైన్ టెక్నాలజీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మిషన్ లెర్నింగ్ వంటివి ప్రస్తుత కాలంలో చాలా ప్రాముఖ్యత కలిగి ఉన్నాయన్నారు. విద్యార్థులు వీటిని నేర్చుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బీఏ స్ఎస్ పద్మజ, ఎంసీఏ విభాగాధిపతి సీహెచ్ మల్లిక, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా దాసాంజనేయుడి దివ్య కల్యాణం

కైకలూరు: కోరుకొల్లు రోడ్డులోని సువర్చల సహిత దాసాంజనేయస్వామి కల్యాణ వార్షిక మహోత్సవాల్లో శుక్రవారం మొదటి రోజు ఆలయ ప్రధాన అర్చకుడు పరిమి శివయ్య ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో కల్యాణం నిర్వహించారు. విశ్రాంత హెచ్ఎం పార్వతీశ్వర్, హేమలత దంపతులు కల్యాణ క్రతువును నిర్వహించారు. హనుమా గోష్ఠి ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పఠించారు.

గ్రంథాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షునిగా వెంకట రమణ

గుడివాడటౌన్: ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షునిగా గుడివాడ గ్రంథాలయ అధికారి బీరం వెంకట రమణ ఎన్నికైనట్లు తెలిపారు. విజయవాడ లోని ఠాగూర్ మెమోరియల్ గ్రంథాలయంలో శుక్రవారం జరిగిన ఎన్నికలో బీరం వెంకట రమణ అధ్యక్షునిగా, ప్రధాన కార్యదర్శిగా కె.రాంబాబు, గౌరవ అధ్యక్షునిగా కె.మధుసూదనరాజు, అసోసియేట్ అధ్యక్షునిగా ఐవీవీ రామారావు, కోశాధికారిగా డి.నాగరవి, రాష్ట్ర ప్రతినిధిగా కె.నాగరాజు ఎంపికైనట్లు వెంకటరమణ తెలిపారు.

వణుదుర్రులో రెవెన్యూ గ్రామసభ

ముదినేపల్లి రూరల్: మండలంలోని వణుదుర్రు సచివాలయం వద్ద శుక్రవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ జేవీస్ సుభాని రైతుల నుంచి పలు సమస్యలపై వచ్చిన 18 దరఖాస్తులను స్వీకరించారు.

అంగన్‌వాడీల్లో మరుగుదొడ్ల నిర్మాణం

గుడ్లవల్లేరు: జిల్లాలో సర్వశిక్షా అభియాన్ నిధులు రూ.60.48 లక్షలతో టాయిలెట్స్‌ను నిర్మిస్తున్నట్లు స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.సువర్ణ తెలిపారు. ఒక్కో టాయిలెట్‌ను రూ.36 వేల వ్యయంతో జిల్లాలో 168 టాయిలెట్స్‌ను నిర్మిస్తున్నామన్నారు.

సంక్షిప్త వార్తలు

హనుమంతునికి సహస్ర కమల కేళీలతో అర్చన

పామర్రు: స్థానిక బుచ్చమ్మ ఆశ్రమంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో హనుమత్ వ్రతం సందర్భంగా శుక్రవారం ఆలయంలో స్వామికి పంచామృతాలతో, నవరసాలతో, సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేకంగా అభిషేకాలను చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులతో సహస్ర కమలా ఫలాలతో, అరటి పళ్లతో స్వామికి విశేషంగా పూజలను నిర్వహించారు. యాజ్ఞికులు దీవి రామకృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో స్థానిక ప్రతాప్ కళాశాల ప్రిన్సిపాల్ వైఎస్ఎన్ ప్రసాద్, లావణ్య దంపతులు పీటలపై కూర్చుని పూజలు జరిపారు. కార్యక్రమంలో దీవి శ్రీమన్నారాయణాచార్యులు, ఆర్.గోపి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రామ సభలు

గుడివాడటౌన్: గుడివాడ రూరల్ మండలం చిరిచింతల, రామచంద్రాపురం గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ గ్రామసభలు నిర్వహించారు. చిరిచింతలలో నాలుగు దరఖాస్తులు రాగా మూడు పరిష్కరించామని, రామచంద్రాపురంలో వచ్చిన ఒక్క దరఖాస్తును కూడా అక్కడే పరిష్కరించామన్నారు.

దివ్యాంగులకు అన్నసమారాధన

గుడివాడటౌన్: శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక చౌదరిపేటలోని శిరీష రీహేబిలిటేషన్ సెంటర్‌లోని మానసిక వికలాంగ చిన్నారులకు, దివ్యాంగ చిన్నారులకు అన్నసమారాధన జరిపారు. సేవాసంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షుడు నాలి బాలాజీ వితరణతో కార్యక్రమం నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుడివాడ టౌన్: రెండవ శనివారం విద్యుత్ లైన్‌లు, సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఈఈ జి.బి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మేదరబజారు, నెహ్రూ చౌక్, పాత, కొత్త మున్సిపల్ కార్యాలయాలు, భాస్కర్ థియేటర్, సత్యన్నారాయణపురం, వాణి సదన్ ప్రాంతాలలో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు గుడివాడ విద్యార్థులు

గుడివాడటౌన్: భారతీయ విజ్ఞాన మండలి ఏటా నిర్వహించే సైన్స్ టాలెంట్ టెస్ట్(కౌశల్) రాష్ట్ర స్థాయి పోటీలకు గుడివాడ విద్యార్థులు ఎంపికైనట్లు డీవైఈఓ ఐ.పద్మరాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుడివాడ పురపాలక సంఘానికి చెందిన ఏకేటీపీ బాలికోన్నత పాఠశాల నుంచి షేక్ జాస్మిన్, ఏజీకే హైస్కూల్ నుంచి వై.సురేంద్ర క్విజ్ విభాగంలో, ఏకేటీపీ హైస్కూల్‌కు చెందిన వి.ఆకాంక్ష రీల్స్ విభాగంలో జిల్లా స్థాయి పోటీల్లో విజయం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. డిసెంబర్ 30న విజయవాడలో జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు.

ఆలపాడు రెవెన్యూ సదస్సులో 11 అర్జీలు

కైకలూరు: ఆలపాడు సచివాలయం వద్ద శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో మొత్తం 11 అర్జీలు అందాయి. నిర్ణీత కాలంలో సమస్యలను పరిష్కరిస్తామని ఇన్‌చార్జి తహసీల్దారు ఎండీ ఇబ్రహీం తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కొప్పుల కృష్ణకుమారి, వీఆర్వో శ్రీనివాసరావు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

పామర్రు: తోట్లవల్లూరులోని మరనాత ప్రార్థనా మందిరంలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్ కట్ చేసి, శాంతి క్యాండిల్స్‌ను వెలిగించారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, ప్రార్థనా మందిర నిర్వాహకులు, పాస్టర్లు పాల్గొన్నారు.

రైతుపోరుకు భారీగా తరలిన వైఎస్సార్ సీపీ నేతలు



డీఎన్నార్ ఆధ్వర్యంలో ఏలూరు బయలుదేరి వెళుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

కైకలూరు: ధాన్యానికి కనీస మద్దతు ధర, ఉచిత పంటల బీమా పథకం పునరుద్ధరణ, దళారీ వ్యవస్థ నిర్మూలన వంటి ప్రధాన డిమాండ్లతో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపుతో కైకలూరు నుంచి ఏలూరు కలెక్టర్ కార్యాలయానికి శుక్రవారం భారీగా నాయకులు తరలి వెళ్లారు. వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ఆధ్వర్యంలో కైకలూరు నియోజకవర్గం నాలుగు మండలాల ప్రజాప్రతినిధులు ఉదయం పార్టీ కార్యాలయం నుంచి వాహనాలతో బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి వైఎస్సార్‌సీపీ ఎంపీపీలు చందన ఉమామహేశ్వరరావు, పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, రామిశెట్టి సత్యనారాయణ, రాష్ట్ర ముదిరాజ్ విభాగ రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధనరావు, వైస్ ఎంపీపీలు కూసనపూడి కనకదుర్గారాణి, రాచూరి రాధ, ఎంపీటీసీ సాధు కొండయ్య, సర్పంచులు జయమంగళ కాసులు, బేతపూడి ఏసోబురాజు, మండల అధ్యక్షుడు గోట్రు ఏసుబాబు, తిరుమాని రమేష్, నాయకులు ఘంటా సంధ్య, కూనవరపు సతీష్, రాము, పంజా నాగు, ఫిరోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

వైభవంగా డోకిపర్రు ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

గుడ్లవల్లేరు: మండలంలోని డోకిపర్రు గ్రామంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. అంకురారోహణం, సేనాధిపతి ఉత్సవ కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాల్ని మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చరణ నడుమ ప్రారంభించారు. వేద పండితులు స్వామివార్లకు విశేషాభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో దేవస్థాన నిర్వాహకులు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు, కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయభాస్కరమ్మ దంపతులు పాల్గొన్నారు.



స్వామివార్ల ఉత్సవమూర్తులకు అభిషేకాలు

సీఎం పర్యటన ఏర్పాట్లపై పరిశీలన

గుడ్లవల్లేరు: డోకిపర్రులోని భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకునేందుకు శనివారం ఉదయం 11 గంటలకు సీఎం చంద్రబాబు నాయుడు రానున్నారు. ఈసందర్భంగా శుక్రవారం రాత్రి జిల్లా కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ, ఎస్పీ గంగాధరరావు ఏర్పాట్లను పరిశీలించారు.



సీఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, జేసీ

ఘనంగా ప్రారంభమైన ధనుర్మాసోత్సవాలు

గుడివాడటౌన్: స్థానిక జగన్నాధపురం పాటిమీద ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో వార్షిక ధనుర్మాస మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేదపండితుల మంత్రోచ్చరణల ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ వేణుగోపాలరావు మాట్లాడుతూ ఈనెల 16 నుంచి వచ్చే ఏడాది జనవరి 14వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగిస్తామన్నారు. ధనుర్మాస మహోత్సవాలు ఈ ఆలయంలో ప్రారంభించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ ఏడాది ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఆండాళ్ అమ్మవారికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాలను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ సీహెచ్ ఇందిరా రమణరావు, భజన సంఘం, గోవిందనామ సంఘాల భక్తులు పాల్గొన్నారు.

కనుమూరు గ్రామ సర్పంచ్ సుఖవేణి మృతి



కనుమూరు(పామర్రు): మండలంలోని కనుమూరు గ్రామ సర్పంచ్ కొడాలి సుఖవేణి(50) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. కొంత కాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. సుఖవేణి 2021లో గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. సుఖవేణి భౌతికకాయాన్ని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీ ఆరుమళ్ల రమాదేవి, ఎంపీటీసీ సభ్యులు రత్నకుమారి, కాకుళ్ల రాజ్యలక్ష్మి, భోగిన వెంకటేశ్వరమ్మ, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ హస్మతుల్లా, జమీగొల్వేపల్లి సర్పంచ్ ఆర్.శాంతకుమారి, కుందేటి రాణి సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఎంపీపీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి ఆమె చేసిన కృషి అభినందనీయమని అన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కొనసాగుతున్న షష్ఠి కల్యాణోత్సవాలు

ముదినేపల్లిరూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ వార్షిక షష్ఠి కల్యాణోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం కృత్తివెన్నుకు చెందిన నాగవిఘ్నేశ్వర కోలాట బృందం మహిళలతో మురళీ కోలాట ప్రదర్శన నిర్వహించారు.ఉదయం సుబ్రహ్మణ్య హవనం నిర్వహించారు.

నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

పమిడిముక్కల: నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల పరిధిలోని 8 సాగునీటి సంఘాలకు శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నవీన్‌కుమార్ తెలిపారు. కపిలేశ్వరపురం సాగునీటి సంఘానికి కపిలేశ్వరపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో, గురజాడ నీటి సంఘానికి తాడంకి హైస్కూల్‌లో, పమిడిముక్కల నీటి సంఘానికి పమిడిముక్కల హైస్కూల్‌లో, హనుమంతపురం నీటి సంఘానికి, హనుమంతపురం హైస్కూల్‌లో, మేడూరు నీటి సంఘానికి మేడూరు హైస్కూల్‌లో, చోరగుడి సంఘానికి చోరగుడి హైస్కూల్‌లో, పెనుమత్స నీటి సంఘానికి అగినపర్రు హైస్కూల్‌లో, ఐలూరు సంఘానికి ఐనపూరు హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.